## క్లుప్తంగా

### నేడు మండల పరిషత్ సమావేశం

వత్సవాయి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు వత్సవాయి ఎంపీడీవో ఎస్.రాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కొలుసు రమాదేవి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొంటారని వివరించారు. సమా వేశానికి ఎంపీటీసీలంతా హాజరుకావాలని కోరారు. మండల స్థాయి అధికారులందరూ సమగ్ర సమాచారంతో సమావేశానికి తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ సూచించారు.

### స్వామిత్వ సర్వేను పూర్తి చేయాలి

జయంతిపురం(జగ్గయ్యపేట): గ్రామాల్లో స్వామిత్వ సర్వేను సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని ఈవోపీఆర్డీ పద్మావతి సూచించారు. మండలంలోని జయంతిపురంలో బుధవారం స్వామిత్వ సర్వేను పరిశీలించారు. ఈసందర్భంగా ఈవోపీఆర్డీ మాట్లాడుతూ శివారు గ్రామం రావిరాలలో కూడా సర్వే పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న గోకులం షెడ్ల పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో చేపట్టిన డ్రైనేజీ పూడిక తీత పనులను పరిశీలించారు. ఆమె వెంట గ్రామకార్యదర్శి ఇమాం సాహెబ్ ఉన్నారు.

### రైతులకు అవగాహన



కెఅగ్రహారం(జగ్గయ్యపేట): ఆయా పంటలసాగులో రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని ఏడీఏ భవానీ సూచించారు. మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ భవాని మాట్లాడుతూ వరి పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఎరువులు, పురుగు మందుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాన్నారు. జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లో 500 టన్నుల యూరియా అందుబాటులో ఉందని వివరించారు. అనంతరం ఆమె జగ్గయ్యపేటలోని పలు పురుగు మందుల విక్రయ దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏవో వరలక్ష్మి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

### నేడు అవగాహన ర్యాలీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని చిల్లకల్లులో గురువారం ఉదయం పదిగంటలకు సూర్యఘర్ పథకంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నితిన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే ఈ ర్యాలీ గ్రామంలోని ప్రధాన రహదారుల్లో కొనసాగుతుందన్నారు. ర్యాలీలో మండలంలోని అన్ని శాఖల అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వెలుగు ఆర్గనైజర్లు పాల్గొనాలని ఆయన సూచించారు .

### ప్రభుత్వాస్పత్రి తనిఖీ



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిని నందిగామ ఆర్డీవో బాలకృష్ణ బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని వైద్యవిభాగాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న సేవలను అడిగితెలుసుకున్నారు. రోగులకు అత్యుత్తమ సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. పరిశుభ్రతపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు నాలుగునెలలుగా జీతాలు రాని విషయం తెలుసుకుని, వారికి జీతాలు అందేలా ఉన్నతాధికారులతో మాట్లాడాలని ఆస్పత్రి సూపరిండెంట్ ఆళ్ల హరీష్‌కు సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ పెద్ది మనోహర్, ఆర్ఐ సూర్య కుమారి దితరులు పాల్గొన్నారు.

### 160 మందికి వైద్య పరీక్షలు



కంచికచర్ల: స్థానిక అక్షర స్కూల్‌లో కంచికచర్ల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్ర ఆసుపత్రి సౌజన్యంతో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, వారి కుటుంబసభ్యులకు కలిపి మొత్తం 160మందికి వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు లయన్స్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పుల్లగూర ప్రభాకర రావు తెలిపారు. ఈ వైద్యశిబిరాన్ని డాక్టర్ కామినేని అచ్యుతరావు పర్యవేక్షించగా, పాఠశాల కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, అమరావతి కంటి ఆస్పత్రి, దుహిత డెంటల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మేలురకం మిర్చికి కేరాఫ్ శివాపురం

- మిర్చి సాగులో రికార్డులు సృష్టిస్తున్న శివాపురం
- అధిక దిగుబడులు వారి సొంతం
- మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి మిర్చి కోతలకు కూలీలు

**రాష్ట్ర సరిహద్దులో ఉన్న శివాపురం గ్రామజనాభా 2,500. గ్రామంలో గతేడాది వరకు 800ఎకరాల్లో మిర్చి సాగవుతుండగా, రైతులు ఈ ఏడాది మొత్తం 1200 ఎకరాల్లో సాగు చేపట్టారు. చుట్టుపక్కల రెవెన్యూలో మరో 800 ఎకరాల వరకు రైతులు మిర్చి సాగు చేశారు. వాతావరణం అనుకూలించకపోయినా రైతులు వ్యయప్రయాసల కోర్చి మిర్చి సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. ఎంతోమంది వ్యవసాయ కూలీలకు ఉపాధి చూపిస్తున్నారు. గ్రామంలో 90శాతం మంది రైతులే కావడం గమనార్హం.**



శివాపురంలో ముమ్మరంగా సాగుతున్న మిర్చి కోతలు

శివాపురం(పెనుగంచిప్రోలు):మండలంలో తెలంగాణ సరిహద్దులో ఉన్న చిన్నగ్రామం శివాపురం. మిర్చి సాగులో రాష్ట్రంలోనే ప్రముఖస్థానంలో ఉంది. గ్రామంలో 5 ఎకరాల నుంచి 60 ఎకరాల వరకు మిర్చిసాగు చేస్తున్న రైతులు ఉన్నారు. గతంలో సాగునీరు లేక, వర్షాలు పడక వాతావరణం అనుకూలించకపోయినా రైతులు లక్షలు ఖర్చు పెట్టి వందల సంఖ్యలో బోర్లు, పదుల సంఖ్యలో బావులు తవ్వుకున్నారు. కష్టపడి పంట పండించుకుంటూ ఆదర్శంగా ఉంటున్నారు. గత మూడేళ్లుగా వర్షాలు పడి సాగునీరు పుష్కలంగా ఉండటంతో సరాసరి ఎకరానికి 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. అయితే ఈ ఏడాది సరాసరి ఎకరానికి 15నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చినా మార్కెట్‌లో మిర్చి ధరలు తక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మిర్చి తేజ రకం క్వింటా రూ.12 వేల నుంచి రూ.14 వేలు ఉండగా లావు రకాలు క్వింటా రూ.8 నుంచి రూ.10 వేలు మాత్రమే ఉన్నాయి. గతేడాది అన్ని రకాలు దాదాపు రూ.20 వేలు క్వింటా ఉన్నాయి.

**మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి కూలీలు...**

గ్రామంలో మిర్చి సాగు ఎక్కువగా ఉండటంతో గ్రామంలో, చుట్టుపక్కల మండలాల నుంచి మాత్రమే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి కూడా కూలీలు గ్రామానికి వస్తుండటం విశేషం. ఇప్పటికే ఈ రెండు రాష్ట్రాల నుంచి 400 మంది వరకు ముఠా కూలీలు వచ్చారు. మరో



మిర్చిని కల్లాల్లో ఆరబెడుతున్న రైతులు

400మంది వరకు రానున్నారు. కూలీలకు రైతులు పొలంలోనే వసతి సదుపాయాలు కల్పించారు. వీరికి తోడు గ్రామంలో 2,500 మంది జనాభా ఉంటే వారికి సరిపోను 2వేల మందికి పైగా వ్యవసాయ కూలీలు మిర్చి కోతలు కోస్తూ, కాయ ఏరుతూ మూడు నెలల పాటు ఉపాధి పొందుతున్నారు. కూలీలు ప్రతిరోజూ ట్రాక్టర్లు, ఆటోల్లో వీరులపాడు, నందిగామ మండలాల నుంచి వస్తారు. వీరికి తోడుగా తెలంగాణ రాష్ట్రం నుంచి కూలీలు గ్రామానికి వస్తున్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారే మూడు నెలల పాటు గ్రామంలో ఉండి మిర్చి కోతలు కోసి కూలీగా కాయలు తీసుకువెళ్లేవారు. ప్రస్తుతం మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన కూలీలకు కిలో మిర్చికి లావులకు కిలోకు రూ.4 నుంచి రూ.6, తేజ రకాలకు కిలోకు రూ.9 నుంచి రూ.11 రైతులు ఇస్తున్నారు. రోజువారీ వచ్చే కూలీలకు ఆటో ఖర్చులు దూరాన్ని బట్టి ఒక్కొక్కరికి రూ.70 నుంచి రూ.100 వరకు రైతులు చెల్లిస్తున్నారు. దీనికి తోడు డిమాండ్‌ను బట్టి కూలీ చెల్లిస్తున్నారు. శివాపురం మిర్చి అంటే క్వాలిటీ ఉంటుందని పేరు ఉండటంతో అధికసంఖ్యలో కొనుగోలుదారులు నేరుగా గ్రామానికి వచ్చి కల్లాల్లోనే మిర్చిని కొనుగోలు చేస్తారు. మిర్చిని కల్లాల్లోనే విక్రయాలు చేస్తుండటంతో తమకు కూడా కొంతమేర శ్రమ తగ్గుతోందని రైతులు చెబుతున్నారు.

### ఎకరాకు 18క్వింటాళ్లు



కూలీల కొరత కారణంగా రెండేళ్లుగా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి కూలీలను తీసుకువస్తున్నాం. పొలంలో వారికి ఉండేందుకు వసతి, కరెంట్, నీటి సదుపాయాలు కల్పిస్తున్నాం. ఎకరానికి సరాసరి 15 నుంచి 18 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

–లగడపాటి సురేష్, రైతు, శివాపురం

### మిర్చి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



మహారాష్ట్ర కూలీల కోత బాగుంటుంది. వీరికి సమయంతో పని ఉండదు. పొద్దున్నే వచ్చి రాత్రి వరకు కోత కొనసాగిస్తారు. భార్యాభర్తలు రోజుకు రూ.1200 నుంచి రూ.1300 సంపాదిస్తారు. మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి.

–తుమ్మల రామారావు, రైతు, శివాపురం

### జీవాలకు నట్టల నివారణ మందులు



కీసర(కంచికచర్ల):మండలంలోని కీసరలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచి పేరం నర్సమ్మ మాట్లాడుతూ పశు వైద్యశిబిరాలను పాడి రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వెటర్నరీ డాక్టర్ కే నవీన్‌కుమార్ మాట్లాడుతూ పశువులకు శ్వాసకోశ వ్యాధులు రాకుండా అవసరమైన మందులు అందజేస్తున్నామన్నారు. బహు వార్షిక పశుగ్రాస పెంచుకునేందుకు రైతులకు వెసులుబాటు కల్పించామన్నారు. గోకులం షెడ్లను నిర్మించుకోవాలని ప్రజలకు సూచించారు. 142 పశువులను పరీక్షించి అవసరమైన మందులు అందజేశారు. 1126 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేసినట్లు వివరించారు. పశువైద్య గ్రామ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

### నేడు హుండీ లెక్కింపు

నందిగామటౌన్: మండలంలోని దాములూరు కూడలి గ్రామంలో వేంచేసియున్న సంగమేశ్వరస్వామి వారి ఆలయ ఆవరణలో గురువారం హుండీ లెక్కింపు చేపడుతున్నట్లు ఈఓ నరసింహమూర్తి బుధవారం తెలిపారు. దేవదాయ శాఖ నిబంధనలను పాటిస్తూ ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ హుండీ లెక్కింపులో ఆసక్తిగల భక్తులు పాల్గొనాలని ఈఓ కోరారు.

## రోడ్ల పక్కన వ్యర్థాలను పడేస్తే చర్యలు: కలెక్టర్

జగ్గయ్యపేట అర్బన్: బహిరంగ ప్రదేశాలు, రోడ్ల పక్కన వ్యర్థపదార్థాలను పడేసేవారిని మున్సిపల్ సిబ్బంది గుర్తించి వారికి జరిమానా విధించాలని కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ఆదేశించారు. ఇందుకోసం తగిన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య)తో కలిసి బుధవారం ఆయన విలియంపేటలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం ద్వారా పచ్చదనం, పారిశుభ్రతకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పరిసరాల పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. విలియంపేట డంపింగ్ యార్డుకు ప్రత్యామ్నాయంగా వేరేచోట స్థలాన్ని పరిశీలించి యార్డును తరలించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ పచ్చదనం, పరి



డంపింగ్‌యార్డు వద్ద ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

శుభ్రత కార్యక్రమం ద్వారా పట్టణాన్ని సుందరీకరణ చేసేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కమిషనర్ రామ్మోహనరావు, కౌన్సిలర్లు వెంకట్, సైదేశ్వరరావు, తహసీల్దార్ మనోహర్, మున్సిపల్,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### అధికారులతో సమీక్ష

నందిగామ టౌన్: అన్నిశాఖల ప్రభుత్వాధికారలు సమన్వయంతో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సూచించారు. తన కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో బుధవారం ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ సౌమ్య మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అధికారులు కూడా అందుకనుగుణంగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



నందిగామటౌన్: బహుజన సమాజ్ పార్టీని పోలింగ్‌కేంద్రం స్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆపార్టీ సెంట్రల్ జోన్ ఇన్‌చార్జి ఆర్‌జె మల్లికల్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని తెలిపారు. ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కోరారు. అనంతరం రెండు నియోజకవర్గాలకు నూతన కమిటీలను నియమించారు. కార్యక్రమంలో నాయకులు గంగవరపు దేవా, మేకల దుష్యంత్, దాసరి కృష్ణ, కొండమాల ప్రభుదాసు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ప్రతిభచూపిన విద్యార్థులు

జగ్గయ్యపేటఅర్బన్: కృష్ణా యూనివర్సిటీ 5వ సెమిస్టర్ ఫలితాల్లో స్థానిక జేఆర్‌సీ–విశ్వభారతి డిగ్రీ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభను కనబరిచి అన్ని గ్రూపుల్లో పట్టణస్థాయిలో ప్రథమస్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కెఎస్.రమేష్ బుధవారం తెలిపారు. గణితంలో చింతల మానస 100/100, ఫిజిక్స్‌లో చుండూరు వెంకటహర్షిణి 100/100 మార్కులు సాధించి యూనివర్సిటీ టాపర్స్‌గా నిలిచారన్నారు. ప్రతిభచూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ జె.తిరుపతిరావు, కళాశాల యాజమాన్య రంగాపురం నరసింహారావు, పెనుగొండ వెంకటరాజీవ్ అభినందించారు.

# కలెక్టర్ సుడిగాలి పర్యటన

ఏపీఐఐసీ భూముల పరిశీలన

జగ్గయ్యపేట: కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ బుధవారం జగ్గయ్యపేట మండలంలోని జయంతిపురం, షేర్ మహ్మద్‌పేట, చిల్లకల్లు గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం ఏడు గంటలకే ఆయన జయంతిపురం గ్రామానికి చేరుకుని ఏపీఐఐసీకి చెందిన 409ఎకరాల భూమికి సంబంధించిన వివరాలపై సర్వే అధికారులను ఆరా తీశారు. భూముల పరిస్థితి ఎలా ఉంది వాటికి సంబంధించిన రహదారులతోపాటు పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం షేర్‌మహ్మద్‌పేట నుంచి రామచంద్రునిపేట వరకు డీఎంఎఫ్ నిధులు రూ.75 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డును పరిశీలించడంతోపాటు గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిల్లకల్లులో రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీదారుకు చెందిన పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో నాలుగు వేల అర్జీలు వచ్చాయని మూడువేల అర్జీలను పరిష్కరించగా



జయంతిపురంలో ఏపీఐఐసీ భూముల రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

మరో వెయ్యి అర్జీలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు సద్వినియోగించుకునేలా ప్రచారం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో బాలకృష్ణ, తహసీల్దార్ మనోహర్, ఎంపీడీవో నితిన్, ఈవోపీఆర్డీ పద్మావతి, సర్వేయర్ అనూష్‌బాబు, ఆర్ఐ సూరమ్మ, పీఆర్ జేఈ శ్రీనివాసరావు, కార్యదర్శి హుసేన్, ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు. ఉదయం ఆరుగంటల నుంచే జగ్గయ్యపేట నియోజకవర్గంలో కలెక్టర్ లక్ష్మీశ పర్యటిస్తుండటంతో ఆయా శాఖల అధికారులు ఉరుకులుపరుగులు పెట్టారు.

## కుష్ఠువ్యాధిపై ఇంటింటా సర్వే పరిశీలన

కంచికచర్ల:సమాజంలో కుష్ఠువ్యాధిని సమూలంగా పారద్రోలేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కుష్ఠు వ్యాధి నిర్మూలన విభాగం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ దేవప్రసాద్ కోరారు. కుష్ఠువ్యాధి నిర్మూలనపై కంచికచర్ల పీహెచ్‌సీ పరిధిలో చేపట్టిన ఇంటింటి సర్వే, వ్యాధి నిర్ధారణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. వైద్య,ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం దేవప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి 2వ తేదీ వరకు కొనసాగే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కె.మధురిమ, సూపర్‌వైజర్ జీవీ రాఘవేంద్రరావు, బి.సారీలమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కంచికచర్ల పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జేడీ దేవప్రసాద్

## ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాల్సిందే

జగ్గయ్యపేట అర్బన్: ద్విచక్ర వాహనదారులంతా తప్పకుండా హెల్మెట్ ధరించాల్సిందేనని పేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీఎస్ రాజు సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా హెల్మెట్ వినియోగంతో కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ బుధవారం హెల్మెట్‌ను ధరించిన ద్విచక్రవాహనదారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా బైకులు నడిపితే కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. మోటార్ వెహికల్, ట్రాఫిక్, ఫైర్‌శాఖల సిబ్బందితోపాటు కేసీపీ సిమెంట్, ఆయా కార్లు, బైక్ షోరూమ్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

## సేంద్రీయ ఎరువులతో అధిక ఫలసాయం

కంచికచర్ల: సేంద్రీయ ఎరువుల వినియోగంతో తక్కువ పెట్టుబడితో రైతులు అధిక ఫలసాయం పొందవచ్చని వ్యవసాయశాఖ జిల్లా ఆత్మ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ యు.నరసింహారావు పేర్కొన్నారు. కంచికచర్లలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి శనగపంటను పరిశీలించారు. కార్యక్రమంలో నందిగామ ఏడీఏ బికే శ్రీనివాస్,



పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బీ వెంకట్రావు, మండల వ్యవసాయాధికారి కే విజయ కుమార్, గ్రామీణ వ్యవసాయ సహాయకులు హనేష్, రమ్య, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ లేఅవుట్లపై చర్యలకు డిమాండ్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో అక్రమ లేఅవుట్ల కారణంగా జగ్గయ్యపేట పురపాలక సంఘం సుమారు రూ.10 కోట్ల విలువైన స్థలాలను కోల్పోయిందని ఐదోవార్డు కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్ అన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్‌చైర్మన్ ఆర్. రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావును కలిసి వినతిపత్రాలు అందజేశారు. పట్టణంలో డివైడర్లపై మొక్కల మార్పు, విలియంపేట చెత్త డంపింగ్‌యార్డు స్థలం మార్పు, వీధికుక్క స్వైరవిహారం, ట్రాఫిక్ ఇబ్బందులు, చెరువు వద్ద మొక్కల సంరక్షణను పట్టించుకోకపోతుండటం, మున్సిపల్ పార్కులో జిమ్ వస్తువులు దెబ్బతినడం తదితర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అక్రమ లేఅవుట్ల చిత్రాలను ప్రదర్శించారు. 8నెలలుగా మున్సిపల్ పరిధిలోని బలుసుపాడు రోడ్డు, సత్యానారాయణపురం, శాంతినగర్, తొర్రగుంటపాలెం, ఆర్టీసీ కాలనీ తదితర ప్రాంతాల్లో పలువురు అక్రమ లేఅవుట్లు వేస్తూ కమ్యూనిటీస్థలాల నిబంధన కింద మున్సిపాలిటీకి అప్పగించాల్సిన పదిశాతం భూమిని కూడా విక్రయిస్తున్నారు. దీంతో భవిష్యత్‌లో ఆయా లేఅవుట్లలో కమ్యూనిటీస్థలం ఉండక ప్రజలు ఇబ్బందిపడతారన్నారు. అదేసమయంలో మున్సిపాలిటీకి దక్కాల్సిన పదిశాతం భూమిని దక్క



కమిషనర్ రామ్మోహనరావుకు వినతిపత్రం అందజేస్తున్న వట్టెం మనోహర్

కుండా పోతోందన్నారు. మున్సిపాలిటీకీ జరుగుతున్న నష్టానికి మున్సిపల్ అధికారులు, పాలకవర్గం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ అధికారులు రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు సహకరిస్తూ మున్సిపల్ ఆదాయాన్ని, కమ్యూనిటీ స్థలాలను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శాంతినగర్‌లోని పుట్టబజారు వద్ద మున్సిపల్ లేఅవుట్ స్థలాన్ని ఓవ్యక్తి ఆక్రమించి గోడ నిర్మాణం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇకనైనా మున్సిపల్ పాలకవర్గం, అధికారులు స్పందించి అక్రమలేవుట్లపై చర్యలు తీసుకుని మున్సిపాలిటీ ఆదాయానికి గండిపడకుండా చూడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆయా అంశాలపై తమ పార్టీ ఆధ్వర్యంలో న్యాయపోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు.

## వీరమణితేజ మృతికి ప్రమాదమే కారణం : ఏసీపీ

నందిగామటౌన్: చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన నల్లాని వీరమణితేజ మృతికి రోడ్డు ప్రమాదమే కారణమని నందిగామ ఏసీపీ తిలక్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15న వీరమణితేజ ద్విచక్రవాహనంపై వస్తూ తీవ్రగాయాలై మృతిచెందడంతో ఆయన కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు వివరించారు. మృతుడు వీరమణితేజ చందర్లపాడులో నిర్వహించిన సంక్రాంతి సంబరాలను ముగించుకుని మద్యంమత్తులో రాంగ్‌రూట్‌లో అతివేగంగా ద్విచక్రవాహనంపై ముప్పాళ్ల వస్తూ, అదే సమయంలో ముప్పాళ్ల వైపు నుంచి చందర్లపాడుకు కుటుంబసభ్యులతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్న చందర్లపాడు గ్రామానికి చెందిన జుర్రిపోతుల ఏసుబాబు ద్విచక్రవాహనాన్ని వేగంగా





విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ తిలక్

ఢీకొట్టాడని డీసీపీ తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వీరమణితేజ అక్కడికక్కడే మృతిచెందాడని తమ దర్యాప్తులో తేలినట్లు వివరించారు. వీరమణితేజ మృతిపై అనుమానాలకు తావు లేకుండా నిస్పక్షపాతంగా దర్యాప్తు చేశామని తెలిపారు. సమావేశంలో సీఐలు వైవిఎల్ నాయుడు, చవాన్ పాల్గొన్నారు.

## ఆస్పత్రి రోడ్డును అభివృద్ధి చేస్తాం: ఎంపీపీ

కంచికచర్ల: స్థానిక పీహెచ్‌సీరోడ్డును సిమెంటురోడ్డుగా అభివృద్ధి చేస్తామని ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ తెలిపారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేల్పుల శ్రీనివాసరావుతో కలసి బుధవారం ఆయన పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డును పరిశీలించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు ఎంపీటీసీలు, ప్రజలు కోరడంతో ఆ మేరకు పరిశీలించినట్లు తెలిపారు. నేషనల్ హైవే నుంచి మోడల్‌కాలనీ, ఇందిరాకాలనీతోపాటు మండలంలోని గొట్టుముక్కల గ్రామానికి వెళ్లేవారు ఈరోడ్డులో రాకపోకలు సాగిస్తుండటంతో



నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. ఆస్పత్రిరోడ్డును త్వరలోనే సిమెంటురోడ్డుగా అభివృద్ధి చేస్తామని వివరించారు.

## పశుగణాభివృద్ధికి చర్యలు : డీడీ

వీరులపాడు: పశుగణాభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మోజెస్ తెలిపారు. మండలంలోని దొడ్డదేవరపాడులో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ మోజెస్ మాట్లాడుతూపశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా పశుపోషకులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా దూడలకు క్రమం తప్పకుండా టీకాలు, వ్యాక్సిన్‌లు వేయించాలన్నారు. ఈ శిబిరంలో 50 పశువులకు చికిత్స చేయడంతోపాటు 850 జీవాలకు నట్టల నివారణ మందులు అందించినట్లు మండల పశువైద్యాధికారి శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం లేగ దూడలకు అందాల పోటీలు నిర్వహించి వాటి యజమానులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి సుమంత్ రెడ్డి, సర్పంచ్ చెంద్యాల రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణమూర్తి, పశుపోషకులు పాల్గొన్నారు.



పశువైద్యాశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీడీ డాక్టర్ మోజెస్